కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -272 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 12-10-2026 సోమవారం పేజీలు : 4



# కరువు ముప్పు
# సీఎం కసరత్తు!

- ఎల్‌నినో ముప్పుపై తెలంగాణ అప్రమత్తం
- ఎనిమిది నెలలకు సీఎం యాక్షన్ ప్లాన్
- 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు
- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు
- విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి
- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- ఉపాధి హామీ పనిదినాల పెంపునకు ప్రతిపాదన
- ఎల్‌నినోపై ప్రజలకు విస్తృత అవగాహన
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వార్‌రూమ్

**న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో వర్షాభావం, తాగునీటి కొరత, సాగునీటి సమస్యలు, విద్యుత్ డిమాండ్ వంటి సవాళ్లు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణకు సిద్ధమవుతోంది. పరిస్థితులు తీవ్రరూపం దాల్చకముందే అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

మిగతాది 2 లో..

# మెట్రో ఆపొద్దు..
# సుప్రీం సీరియస్!



2 లో

**న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** రాజధాని ఢిల్లీలో మెట్రో సేవల నిలిపివేత, కఠిన ఆంక్షలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేసిన ధర్మాసనం.. శాంతిభద్రతల సమస్య తీవ్రంగా తలెత్తే వరకు మెట్రో సేవలు యథాతథంగా నడవాలని ఆదేశించింది. ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా మెట్రో సేవలను కొనసాగించాలని, అలాగే నిలిపివేసిన ఇంటర్‌నెట్ సేవలను వెంటనే పునరుద్ధరించాలని పేర్కొంది.

# కూటమిలో జనసేనదే ఎక్కువ త్యాగం!



2 లో

**న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** పోలవరం జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారిగా ఆ జిల్లాలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఏజెన్సీ ప్రాంతంలో 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# తహసీల్దార్‌కు కలెక్టర్ షాక్!

- రైతు ఆవేదనపై అధికారి వెటకారం
- 'ఇంకా పురుగుల మందు తాగలేదా?' వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో
- అధికారిపై ప్రజలు, రైతు సంఘాల ఆగ్రహం
- ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశం
- కలెక్టర్‌కు నివేదిక.. వెంటనే సస్పెన్షన్




**న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** వ్యవసాయ భూమి సమస్యపై న్యాయం కోసం వచ్చిన ఒక రైతు పట్ల బాధ్యతారాహిత్యంగా, అవహేళనగా మాట్లాడిన సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్ స్వామి పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఆర్డీవో ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

అసలేం జరిగిందంటే..

వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ రైతు పరిష్కారం కోసం గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న ఎమ్మార్వో స్వామిని ఆశ్రయించి తన ఆర్తిని వెళ్లబోసుకోగా, సదరు అధికారి రైతుకు భరోసా ఇవ్వాల్సింది పోయి తీవ్రంగా అవమానించినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2 లో

# వైద్య సేవలో అక్రమాలు..
# రూ.34 కోట్ల జరిమానా!




- 203 ఆసుపత్రులకు రూ.34.39 కోట్ల జరిమానా
- వైద్య సేవల అక్రమాలపై ఏపీ సర్కార్ కొరడా
- 25 ఆసుపత్రుల సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- 13 ఆసుపత్రులకు చెల్లింపులు బంద్
- ఐదు ఆసుపత్రులు నెట్‌వర్క్ నుంచి తొలగింపు
- నకిలీ బిల్లుల గుర్తింపునకు ఏఐ టెక్నాలజీ

2 లో

# బీసీ రిజర్వేషన్లపై
# జీవో సవరణ!




2 లో

- జీవో 153 అమలుకు అధికారులకు ఆదేశాలు
- 34 శాతం రిజర్వేషన్ల జీవోలో మార్పులు
- 50 శాతం దాటొద్దన్న కోర్టు ఆదేశాలు
- హైకోర్టు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం
- గ్రామాల వారీగా బీసీ రిజర్వేషన్ల ఖరారు
- సీట్లు, పదవుల కేటాయింపునకు ప్రత్యేక నిబంధనలు

# రిమ్స్‌లో అసలేం జరిగింది?

- రిమ్స్‌లో ఐదుగురు శిశువుల మృతి
- ఎలుకలే ప్రమాదానికి కారణమా?
- 50 పేజీల నివేదికలో కీలక అంశాలు
- ఏసీ వైర్లను కొరకడంతో షార్ట్‌సర్క్యూట్?
- ఆరుగురు సభ్యుల కమిటీ విచారణ పూర్తి
- కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి నివేదిక
- ఆస్పత్రిలో భద్రతా లోపాలపై ప్రశ్నలు
- బాధ్యులపై చర్యలు ఉంటాయా?




2 లో

**న్యూస్ డెస్క్ ,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆస్పత్రికి వచ్చేది ప్రాణాలు నిలబెట్టుకోవాలనే ఆశతో.. ముఖ్యంగా నవజాత శిశువుల విషయంలో తల్లిదండ్రులు వైద్యులపై ఎంతో నమ్మకం పెట్టుకుంటారు. అలాంటి చోటే అగ్ని ప్రమాదం సంభవించి ఐదుగురు పసికందులు మృత్యువాత పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆదిలాబాద్ రిమ్స్‌లోని ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగంలో గత నెల 21న రాత్రి జరిగిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఎలుకలు ఏసీ వైర్లను కొరకడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవించినట్లు కమిటీ విచారణలో గుర్తించినట్లు సమాచారం. సుమారు 50 పేజీలతో రూపొందించిన నివేదికను జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేయగా, ఆయన దానిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. అయితే నివేదికలోని పూర్తి వివరాలు, సిఫార్సులు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రమాదానికి అసలు కారణాలు ఏమిటి? భద్రతా లోపాలు ఉన్నాయా? బాధ్యత వహించాల్సింది ఎవరు? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

# రియాద్‌లో రక్తపాతం..
# 12 మంది మృతి?

- రియాద్ ఎయిర్‌పోర్టుపై భీకర దాడి
- క్షిపణి దాడిలో 12 మంది మృతి
- 300 మందికి పైగా గాయాలు
- బాధ్యత ప్రకటించిన హౌతీ మిలిషియా
- విమానాశ్రయ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేత
- వందలాది విమానాలు రద్దు
- ప్రయాణికులను ఖాళీ చేయించిన అధికారులు
- అమెరికా, బ్రిటన్ పౌరులకు హెచ్చరికలు

2 లో

# అరెస్టులు చేసినా వెనక్కి తగ్గం!

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వరకు పోరాటం
- మోదీ, అమిత్ షాపై సీజేపీ నేతల ఫైర్
- ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులంటూ విమర్శ
- రైళ్లు, మెట్రో సేవల రద్దుపై ఆగ్రహం
- ఫోన్ల హ్యాకింగ్, క్లోనింగ్ చేశారంటూ ఆరోపణలు
- పోలీసుల నిర్బంధంలో హింసించారన్న సీజేపీ నేతలు
- జర్నలిస్టుల వేధింపులపై తీవ్ర అభ్యంతరం




2 లో

**న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్):** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని, జ్ఞానేశ్ కుమార్ ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే వీరు యుద్ధం చేస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ అగ్రనేతలు విమర్శించారు. నిర్బంధాలు, కేసులతో మా పోరాటాన్ని ఆపలేరని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు మా పోరాటం ఆగదన్నారు. జ్ఞానేశ్ కుమార్ ను ఎందుకు కాపాడుతున్నారు..అంత అవసరం ఏముంది? జ్ఞానేశ్ ను కాపేడేందుకు దేశమంతా భయానక పరిస్థితి సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జంతర్ మంతర్ ఆందోళనల నేపథ్యంలో పోలీసుల నిర్భందం నుంచి విడుదలైన అనంతరం సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు.

# 70 లక్షల ఓట్లు మాయం..
# బీజేపీకి పొన్నం సవాల్!

- రామచందర్ రావు చర్చకు రావాలంటూ డిమాండ్
- బాధిత ఓటర్లను నేరుగా తీసుకొస్తానన్న మంత్రి
- హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు మాయం
- రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల ఓట్ల తొలగింపుపై ఆందోళన
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లే లక్ష్యమని విమర్శ
- రికార్డులు పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్
- ఓటర్ల జాబితాలో లోపాలు సరిచేయాలని సూచన
- ఓట్ల తొలగింపుపై బీజేపీకి పొన్నం సవాల్

2 లో

# ప్రజాస్వామ్య పరిరక్షణకు
# సీజేఐని కలుస్తాం!

- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: ఖర్గే ఫైర్
- మోదీ, అమిత్ షాపై తీవ్ర విమర్శలు
- నేడు సీజేఐని కలవనున్న ఖర్గే, రాహుల్
- ఇప్పటికే సీజేఐకి ఇద్దరు నేతల లేఖలు
- దేశ పరిణామాలను వివరించనున్న కాంగ్రెస్ నేతలు
- డిమాండ్లు కాదు.. న్యాయం కోరుతామన్న ఖర్గే
- ఢిల్లీలో 32 వేల మంది పోలీసుల మోహరింపు

2 లో

# మెట్రో ఆపొద్దు.. సుప్రీం సీరియస్!

మొదటి పేజీ తరువాయి

బారికేడ్లను కూడా తొలగించాలి..

ఇక నిరసనల నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే తొలగించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. విధులకు హాజరయ్యే న్యాయవాదుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధానిలో విధించిన ఆంక్షల విషయంలో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

కాగా, ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు సిద్ధమైన వేళ ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 10న జంతర్ మంతర్, న్యూఢిల్లీ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరగనున్న నిరసనలు, ఆందోళనకారుల కదలికలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏకంగా 57 మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను తాత్కాలికంగా మూసివేశారు. దీనివల్ల సాధారణ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ అంశంపై సాధారణ ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేతలు, ప్రముఖ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది.

# అరెస్టులు చేసినా వెనక్కి తగ్గం!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. నిన్న మమ్మల్ని విమానంలోనే అదుపులోకి తీసుకున్నారని కిడ్నాప్ చేసినట్లు విమానం నుంచే బలవంతంగా లాక్కెళ్లారని. నిన్న ఢిల్లోలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయన్నారు. గతంలో ఎమర్జెన్సీ గురించి మాత్రమే విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశామన్నారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలోనూ రైళ్ల రద్దు జరగలేదు కానీ మోడీ హయాంలో మాత్రం పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు చేశారన్నారు. రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి.. ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు.

మోడీ ఎందుకు భయపడుతున్నారు?:

అత్యున్నత గొప్ప ప్రధాని కావాలని మోడీ చూస్తున్నారు. కానీ ప్రజలు, యువతను చూసి మోడీ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. 1975 తర్వాత మళ్లీ ఎమర్జెన్సీని దేశంలో చూస్తున్నాం. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ప్రజలకు లేదా అని ప్రశ్నించారు. నిన్న ఢిల్లీలో 40 వేల మంది భద్రతా బలగాలను మోహరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, సరిహద్దుల నుంచి బలగాలను రప్పించారని ఆరోపించారు. జమ్ము-కశ్మీర్ సరిహద్దుల నుంచి కూడా బలగాలను రప్పించారు. ఢిల్లీలో రైళ్లు, మెట్రోరైలు సర్వీసులను రద్దు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. నిన్న మమ్మల్ని మాఫియా ముఠాలను అరెస్టు చేసినట్లు చేశారు. మా సెల్ ఫోన్లను లాక్కుని ఎవరితో మాట్లాడకుండా చేశారు. ప్రైవేటు వాహనాల్లో ఒక్కొక్కరిని ఒక్కో ప్రాంతానికి తరలించారన్నారు.

మా ఫోన్లు లాక్కుని క్లోనింగ్:

కనీసం లాయర్లను సంప్రదించే అవకాశం కూడా లేకుండా మా హక్కులను హరించారని, మా ఫోన్లను లాక్కుని హ్యాకింగ్, క్లోనింగ్ చేశారని ఆరోపించారు. సీజేప ముంబయి కో ఆర్డినేటర్ ప్రణయ్ ను కస్టడీలో హింసించారు. కస్టోడియల్ హింసపై కోర్టులు, మానవహక్కుల సంస్థలు స్పందించడం లేదు. నిన్న విధుల్లో ఉన్న పోలీసుల్లో ఎవరికీ నేమ్ బ్యాడ్జీలు లేవు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులను వేధిస్తున్నారు. జర్నలిస్టులను కూడా కేసులు పెట్టి బంధిస్తున్నారని మండిపడ్డారు.

# రియాద్‌లో రక్తపాతం.. 12 మంది మృతి?



న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్): సౌదీ అరేబియా రాజధాని రియాద్ లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం పై హౌతీలు జరిపిన క్షిపణి దాడిలో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో 300 మందికి పైగా గాయపడ్డారని సౌదీ అరేబియా జనరల్ అథారిటీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. మృతి చెందిన వారిలో నలుగురు సౌదీ పౌరులు కాగా.. మిగతా వారు బంగ్లాదేశ్ (2), అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, పాలస్తీన్, సూడాన్‌లకు చెందిన విదేశీ నివాసితులు ఉన్నారు. గాయపడిన 309 మందిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. వీరందరికీ వివిధ ఆసుపత్రులలో చికిత్స అందిస్తున్నారు. అయితే, ఆ దాడులకు తమదే బాధ్యతని యెమెన్ హౌతీ మిలిషియా ప్రకటించింది.

విమానాశ్రయ సేవల నిలిపివేత..

యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులపై సౌదీ నేతృత్వంలోని కూటమి పెద్దఎత్తున సైనిక దాడిని ప్రారంభించిన తర్వాత, గత వారం రోజులుగా ఈ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని వరుస దాడి జరుగుతున్నాయి. ఈ దాడి నేపథ్యంలో విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రయాణికులను ఖాళీ చేయించగా, వందలాది విమానాలు రద్దు కాగా మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ తీవ్రమైన ఘటనపై రియాద్‌లోని అమెరికా, యూకే రాయబార కార్యాలయాలు స్పందించాయి. తమ దేశ పౌరులు విమానాశ్రయానికి దూరంగా ఉండాలని భద్రతా హెచ్చరికలు జారీ చేశాయి.

# కూటమిలో జనసేనదే ఎక్కువ త్యాగం!

మొదటి పేజీ తరువాయి



పర్యటనలో భాగంగా గిరిజనులు తయారు చేసిన అటవీ ఉత్పత్తులు, వాటికి అందుతున్న మార్కెటింగ్ సదుపాయాల గురించి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రగతిని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాటా మంతి నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి.. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలోని 'రాకోట'ను రెవెన్యూ గ్రామంగా మార్చాలని గ్రామ ప్రజలు ఆయనను కోరగా.. వెంటనే సానుకూలంగా స్పందించి దానిని నెరవేర్చుతామని పవన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ గిరిజన మహిళ పవన్ కల్యాణ్‌ను ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. "మీరు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది" అంటూ ఆమె దీవించడం విశేషం.

ఓట్లు కాదు.. అభివృద్ధే నా లక్ష్యం..

పవన్ కల్యాణ్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు వేయాల్సిందే అని నేను గట్టిగా పట్టుబట్టాను. రోడ్డు వేయడమంటే కేవలం రెండు ప్రాంతాలను కలవడం కాదు.. ఒక గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించడం. ఇక్కడ ఓట్లు ఎన్ని వచ్చాయన్నది నేను చూసుకోలేదు.. కేవలం అభివృద్ధినే ప్రామాణికంగా తీసుకున్నాను." అని ఆయన స్పష్టం చేశారు.

జనసేన త్యాగాలను గుర్తుచేసిన డిప్యూటీ సీఎం..

ప్రసంగం ముగింపులో రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. "చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు ఎవరూ రోడ్ల మీదకు రాలేదు.. కానీ మా జనసైనికులు మాత్రం రోడ్ల మీదకు వచ్చి పోరాడారు. కూటమిలోని మూడు పార్టీల్లో జనసేనే ఇప్పటివరకు చాలా త్యాగాలు చేస్తూ వచ్చింది. దానికి తగిన ప్రాతినిధ్యం దక్కేలా స్థానిక ఎన్నికల్లో ప్రతి నాయకుడు అండగా ఉండాలి." అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు సీజేఐని కలుస్తాం!




న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్): దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బెంగళూరు లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో కల్లోలం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపైనే తాము పోరాటం చేస్తున్నట్లుగా ఆయన స్పష్టం చేశారు. దేశంలో నెలకొన్న తాజా రాజకీయ, సామాజిక పరిస్థితులపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ను కలవనున్నట్లుగా మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. తాను, రాహుల్ గాంధీ ఇప్పటికే వేర్వేరుగా ఆయనకు లేఖలు కూడా రాశామని తెలిపారు. నేడు సాయంత్రం 4 గంటలకు సీజేఐని కలిసి దేశంలో జరుగుతున్న పరిణామాలను వివరిస్తామని, ఎలాంటి డిమాండ్లు చేయబోమని కేవలం చేతులు జోడించి అభ్యర్థిస్తామని ఖర్గే పేర్కొన్నారు.

32 వేల మంది పోలీసుల మోహరింపా..

కేంద్ర ప్రభుత్వ తీరుపై ఖర్గే విమర్శలు గుప్పిస్తూ.. శనివారం దేశ రాజధానిలో దాదాపు 32 వేల మంది పోలీసులను మోహరించారని, ఇదే ప్రభుత్వ భయానికి అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు.

# రిమ్స్‌లో అసలేం జరిగింది?

మొదటి పేజీ తరువాయి

ఎలుకలు ఏసీ వైర్లు కొరకడంతోనే ప్రమాదమా?

రిమ్స్‌లోని ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగంలో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించి ఎలుకల బెడద కీలక అంశంగా మారింది. ఎలుకలు ఏసీ వైర్లను కొరకడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రమాదానికి దారితీసినట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం. దీంతో ఆస్పత్రిలో ఎలుకల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు? విద్యుత్ వైర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేశారా? ఏసీ పరికరాల నిర్వహణ బాధ్యతలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నవజాత శిశువులకు చికిత్స అందించే అత్యంత కీలకమైన విభాగంలో ఇలాంటి ప్రమాదం జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఆస్పత్రిలో పరిశుభ్రత, ఎలుకల నివారణ, విద్యుత్ భద్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి కారణాలు, బాధ్యతలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీ

ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందం నేతృత్వంలో వైద్య, విద్యుత్, నిర్మాణ, అగ్నిమాపక శాఖలకు చెందిన అధికారులు విచారణలో పాల్గొన్నట్లు సమాచారం. కమిటీ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు విద్యుత్ వ్యవస్థ, ఏసీ పరికరాల నిర్వహణ, అగ్నిమాపక ఏర్పాట్లు, ఘటన సమయంలో సిబ్బంది స్పందన, భద్రతా ప్రమాణాల అమలు వంటి అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. సేకరించిన వివరాలు, పరిశీలనల ఆధారంగా సుమారు 50 పేజీల నివేదికను రూపొందించినట్లు సమాచారం. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను గుర్తించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా నివేదికలో సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి నివేదిక

విచారణ కమిటీ రూపొందించిన నివేదికను ఐటీడీఏ పీఓ మంద మకరందం జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేసినట్లు సమాచారం. అనంతరం కలెక్టర్ ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, విద్యుత్ వ్యవస్థలో లోపాలు, ఆస్పత్రి నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలపై నివేదికలో వివరాలు ఉన్నట్లు సమాచారం. అయితే నివేదికలోని పూర్తి వివరాలు, సిఫార్సులు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే ఎవరిపై చర్యలు ఉంటాయి? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.

భద్రత ఎక్కడ.. బాధ్యత ఎవరిది?

ఐదుగురు శిశువుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల అమలుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఏసీ వైర్లు, విద్యుత్ పరికరాలు, అగ్నిమాపక వ్యవస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన బాధ్యత ఎవరిది? ఎలుకల నివారణకు తగిన చర్యలు చేపట్టారా? విద్యుత్ వ్యవస్థలో లోపాలను ముందుగానే గుర్తించే విధానం ఉందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్, అగ్నిమాపక భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం తో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉండాలి. విచారణలో నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రులకు వచ్చే పేద కుటుంబాలకు భరోసా కల్పించాలంటే వైద్య సేవలతో పాటు రోగుల ప్రాణాల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు అందరి దృష్టి ప్రభుత్వ నిర్ణయంపైనే.. నివేదికలోని అంశాలు అధికారికంగా వెల్లడై, బాధ్యతలపై స్పష్టత వస్తుందా? అన్నది వేచి చూడాలి.

# వైద్య సేవలో అక్రమాలు.. రూ.34 కోట్ల జరిమానా!




న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో పేద ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో అక్రమాలకు పాల్పడిన ఆసుపత్రులపై ప్రభుత్వం, వైద్య సేవల ట్రస్ట్ కఠిన చర్యలు తీసుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి 2026-27 వరకు నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 203 నెట్‌వర్క్ ఆసుపత్రులపై మొత్తంగా రూ.34.39 కోట్ల మేర భారీ జరిమానాలు విధించారు. వైద్య సేవల్లో తీవ్రమైన లోపాలు చూపడం, అనుమానాస్పద బిల్లులు దాఖలు చేయడం, రోగుల వద్ద ఉచిత వైద్యానికి అదనపు నిధులు వసూలు చేయడం.. అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడినందుకు గాను ట్రస్ట్ ఈ నిర్ణయం తీసుకుంది.

అక్రమాల తీవ్రతను బట్టి చర్యలు చేపడుతూ 25 ఆస్పత్రుల సేవలను తాత్కాలికంగా సస్పెండ్ చేయగా, 13 ఆస్పత్రులకు చెల్లింపులను పూర్తిగా నిలిపివేశారు. మరో 5 ఆస్పత్రులను నెట్‌వర్క్ జాబితా నుంచే శాశ్వతంగా తొలగించగా, తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన ఇంకో ఆసుపత్రి గుర్తింపును పూర్తిగా రద్దు చేశారు. ఒక్క గడచిన ఆరు నెలల వ్యవధిలోనే 114 కేసులను విచారించి కఠిన నిర్ణయాలు అమలు చేశారు. పేదల కోసం కేటాయించిన ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ట్రస్ట్ పనిచేస్తోంది.

భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకు ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్ట్ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా కల్తీ, నకిలీ , అనుమానాస్పద బిల్లులను త్వరితగతిన గుర్తించడానికి కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. రోజుకు వచ్చే దాదాపు 6,000 ముందస్తు వైద్య అనుమతి (ప్రీ-ఆథరైజేషన్) అభ్యర్థనలను రెండు దశల్లోనూ, రోజుకు సమర్పించే 5,600 చికిత్సల బిల్లులను నాలుగు దశల సుదీర్ఘ పరిశీలన ద్వారా తనిఖీ చేస్తున్నారు. పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే ఆసుపత్రులపై చర్యలు చేపడుతున్నారు.

బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ వారి వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఉచిత సేవలు అందించాల్సిన చోట రోగుల వద్ద నుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే సదరు రుసుమును బాధితులకు తిరిగి ఇప్పించడంతో పాటు ఆ మొత్తానికి మూడు రెట్ల జరిమానాను ఆసుపత్రులపై విధిస్తున్నారు. పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి నిజమైన బిల్లులకు చెల్లింపులు త్వరగా పూర్తి చేస్తూనే, అక్రమాలకు తావులేకుండా యంత్రాంగం నిఘా పెంచింది. ఈ మేరకు సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్ట్ సీఈఓ పద్మావతి ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేశారు.

# 70 లక్షల ఓట్లు మాయం.. బీజేపీకి పొన్నం సవాల్!




న్యూస్ డెస్క్, 11 అక్టోబర్ (బిఎన్ఎస్): రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఓట్ల తొలగింపు అంశంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకు బహిరంగ సవాల్ విసిరారు. ఆదివారం ఆయన నగరంలో మీడియాలో మాట్లాడుతూ.. ఓట్లు కోల్పోయిన బాధితులను నేరుగా తీసుకొస్తానని, దీనిపై చర్చించేందుకు తేదీ, సమయం ఖరారు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ఓట్ల సవరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఓట్లను భారీగా తొలగించారని తీవ్రస్థాయిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. కేవలం ఒక్క హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 40 లక్షల ఓట్లు మాయమయ్యాయని, ఇక రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 70 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. మొత్తం అన్ని రాష్ట్రాల్లో కలిపి సుమారు 13 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తీసివేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

రికార్డులను పరిశీలించి వాస్తవాలు చెప్పాలి..

ఓట్ల తొలగింపు వ్యవహారంపై అధికారిక రికార్డులను సమగ్రంగా పరిశీలించి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని పొన్నం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కీలకమని, ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, లోపాలు ఏమైనా ఉంటే వాటిని వెంటనే సరిదిద్దుకోవడానికి యంత్రాంగం ముందడుగు వేయాలని సూచించారు. బలహీన వర్గాల ఓట్లు గల్లంతు కావడంపై బీజేపీ నాయకత్వం సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు.

# తహసీల్దార్‌కు కలెక్టర్ షాక్!

మొదటి పేజీ తరువాయి

'నువ్వు ఇంకా పురుగుల మందు తాగలేదా.. బతికే ఉన్నావా?' అంటూ రైతును ఎమ్మార్వో ప్రశ్నించినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన తీవ్రమైన పరిస్థితి చూసి నవ్వుతారా అని రైతు కంటతడి పెట్టుకుంటూ అడగ్గా... 'అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది' అని సదరు అధికారి ఏమాత్రం బాధ్యత లేకుండా సమాధానమిచ్చారు.

సోషల్ మీడియాలో వైరల్.. కలెక్టర్ చర్యలు

కష్టాల్లో ఉండి న్యాయం చేయమని కోరిన రైతుతో ఎమ్మార్వో ప్రవర్తించిన తీరుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా లో విపరీతంగా వైరల్ అవుతోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఓ రైతు పట్ల అంత నిర్లక్ష్యంగా, అమానవీయంగా వ్యవహరించడంపై నెటిజన్లు, సాధారణ ప్రజలు మరియు రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించడంతో జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించింది. ఘటనపై ప్రాథమిక విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆర్డీవోను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. ఆర్డీవో సమర్పించిన ప్రాథమిక నివేదికలో ఎమ్మార్వో ప్రవర్తన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలడంతో, కలెక్టర్ తహసీల్దార్ స్వామిని ఇవాళ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్లపై జీవో సవరణ!




న్యూస్ డెస్క్,11 అక్టోబర్ (బిఎన్ఎస్): పంచాయితీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ఏపీ సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జీవో 153 అమలుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో 153 జారీ చేసింది. బీసీలకు 34శాతం రిజర్వేషన్లపై గతంలో జారీ చేసిన జీవో 105లో సవరణలు చేసి కొత్త జీవో విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని కోర్టులు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల అమలుకు ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల వారీగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు చట్ట నిబంధనల ప్రకారం నిర్ణయించాలని ఆదేశించింది. సీట్లు, పదవుల కేటాయింపు, రిజర్వేషన్ల రొటేషన్ పై ప్రత్యేకంగా నిబంధనలు రూపొందించాలని నిర్ణయించింది.

# కరువు ముప్పు.. సీఎం కసరత్తు!

మొదటి పేజీ తరువాయి

రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఈ కాలంలో చేపట్టే ప్రతి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగం, వ్యవసాయ నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం సినిమా, మీడియా, కళాజాతాలు, ఇతర ప్రచార మాధ్యమాలను వినియోగించుకోవాలని సూచించారు. దసరా తరువాత గ్రామాలు, మండలాలు, జిల్లాలు, రాష్ట్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటల పరిస్థితిని అంచనా వేసి, పంటలు చేతికొచ్చే వరకు అవసరమైన నీటి లభ్యతను నిర్ధారించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని, రాష్ట్ర అవసరాల కోసం విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లో తగినంత విద్యుత్ అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. అందువల్ల అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైన మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన సహాయం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. కరువు మండలాల ప్రకటనతో పాటు ఆర్థిక సాయం అందించాలని, రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఉపాధి హామీ కార్యక్రమం కింద ప్రస్తుతం కల్పిస్తున్న 125 రోజుల పనికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అదనపు పనిదినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తక్షణ చర్యలపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్, ప్రజల సమస్యలు తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# చింత చెట్టు చెంతన.. గిరిపుత్రుల చింతలు తీర్చిన ఉప ముఖ్యమంత్రి

**- అడిగిన వెంటనే గిరిజనులకు అభివృద్ధి వరాలు, రూ. 5 కోట్లతో పనులకు మంజూరు**



రంపచోడవరం(బిఎన్ఎస్)అక్టోబర్ 11: అడవి బిడ్డల కష్టాలు తెలుసుకునేందుకు అరణ్యం మధ్యలోని గిరిశిఖర గ్రామానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెళ్లారు.

సుమారు 350 మంది జనాభా కలిగిన రంపచోడవరం నియోజకవర్గం, వేములకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాకోట గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమంలో భాగంగా కాకవాడ-వేములకొండ అడవి తల్లి బాట రహదారికి శంకుస్థాపన చేశారు.

కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపేలా రూ. 2.29 కోట్ల వ్యయంతో 3.4 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఉన్న రచ్చబండ వద్ద గిరిపుత్రులతో 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల, ఆరోగ్య కేంద్రం, ఆలయ అభివృద్ధికి నిధులు:

రాకోటలో ఎంపీపీ పాఠశాల శిథిలావస్థలో ఉండటం గమనించి పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. గ్రామ ఇలవేల్పు అయిన హనుమాన్ ఆలయం రేకుల షెడ్డులో ఉండటం చూసి, దేవాదాయ శాఖ సహకారంతో భజన మందిరంగా అభివృద్ధి చేసేందుకు మరో రూ. 20 లక్షలు కేటాయించారు.

గిరిజన గ్రామాల సమస్యలకు తక్షణ పరిష్కారాలు:

మాటా-మంతి లో వేములకొండ, సువర్లవాడ, దబ్బావలస, తిరుగటిరాళ్లు, కాకవాడ, చిలకవీధి, వెట్టిచెలకలు, సోకులగూడెం గ్రామాల ప్రజలు సమస్యలు విన్నవించారు. ప్రతి గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రంతో కూడిన మండల పరిషత్ పాఠశాల, విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ పనుల కోసం వివిధ పథకాల ద్వారా దాదాపు రూ. 5 కోట్లు కేటాయించారు.

ఘన స్వాగతం పలికిన గిరిజనులు:

రాకోటకు వచ్చిన పవన్ కళ్యాణ్ కు గిరిజన మహిళలు పూల బొకేలు అందజేసి, జలహారతులు పట్టి, పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు.

అనంతరం వెదురు బొంగులతో గృహోపకరణాలు తయారు చేస్తున్న కొమ్మిరెడ్డి కుటుంబాన్ని పలకరించి, వెదురు ఉత్పత్తుల విలువ పెంపునకు ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కాకవాడ గ్రామంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 కింద వాటర్‌షెడ్ అభివృద్ధి పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, గిరిజన రైతులకు పరికరాలను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 68 కోట్లతో 34 వేల మంది రైతులకు పనిముట్లు ఇవ్వనున్నారు.

# 102 మంది ఆర్యవైశ్య మహిళల చేత కన్యకా పరమేశ్వరి అమ్మవారుకు నవగంగ జలాలు..!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 11:

దసరా ఉత్సవాల్లో భారత దేశంలోనే రెండో మైసూరు గా పేరుగాంచిన కడప జిల్లా ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలతో పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రధానంగా ప్రొద్దుటూరు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం లో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా పండుగ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అయుర, ఆరోగ్యాలతో అమ్మవారి ఆశీస్సులు కలగాలని శ్రద్ధ తో నిర్వహిస్తారు. ఈ క్రమంలో తొమ్మిది రోజుల ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారి శాల నుంచి 102 మంది ఆర్య వైశ్య మహిళలు, కల్చలు ఊరేగింపుగా వచ్చి శివాలయం నుంచి నవగంగ జలాలను మంగళ వాయిద్యాలు నడుమున తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శన ఏర్పాట్ల లో భాగంగా ప్రత్యేకమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా ఆలయ కమిటీ, మరియు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# నేడు శ్రీ గాయత్రీ దేవి గా దర్శనం ఇవ్వనున్న దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజున ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ గాయత్రీ దేవిగా దర్శనం ఇవ్వనున్నారు. సకల మంత్రాలకి , వేదాలకి మూలమాతగా అమ్మవారికి అత్యంత విశేషమైన ప్రాసత్యం ఉన్నది. గాయత్రి అంటే ఉత్కృష్టమైనది అని అర్థం. గాయత్రి ఉపాసకులు అమ్మవారిని ఈ మంత్రంతో వారి వారి ప్రాంతాల్లో అనుష్క ఉపాసన ప్రారంభిస్తారని వేదాలు చెబుతున్నాయి.

అమ్మవారికి మంత్రం ఈ మంత్రం.

*ముక్తావిద్రుమ హేమనీలధవళచ్ఛాయైర్ముఖైస్త్రీక్షణైః యుక్తామిందునిబద్ధరత్నమకుటాం తత్వార్థవర్ణాత్మికామ్ । గాయత్రీం వరదాభయాంకుశకశాః శుభ్రం కపాలం గదాం శంఖం చక్రమథారవిందయుగళం హస్తైర్వహంతీం భజే ॥*

సకల మంత్రాలకీ మూలమైన శక్తిగా,శ్రీ వేదమాతగా ప్రసిద్ధిపొంది ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శన మిచ్చే సంధ్యా వందన దేవత గాయత్రీ దేవి అని శాస్త్రాల్లో చెప్పబడి ఉంది. శిరస్సు భాగంలో బ్రహ్మ, హృదయ భాగమందు విష్ణువు, శిఖయందు రుద్రుడు నివసిస్తూ ఉండగా త్రిమూర్తి అంశ దేవిగా గాయత్రీ దేవి నిత్య జీవనై భక్తులను కాపాడుతూ ఉంటుంది.సమస్త దేవతామంత్రాలకీ గాయత్రీ మంత్రంతో అంతర్భాగంగా అనుబంధం ఉంది. సకల దేవతలకు వేదమంత్రాలు సాక్షిగా అందజేసే వివేదన గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ తోనే ప్రారంభమవుతుంది. దేవతలకు అన్నాదులు, ప్రసాదాలు గాయత్రీ సంప్రోక్షణ తర్వాతే నివేదన చేయబడతాయి. గాయత్రీ అవతారంలో దుర్గమును దర్శించుకుంటే వాక్ శుద్ధి, మంత్రసిద్ధి, జ్ఞానము, తేజస్సు, ఆరోగ్యము లభిస్తుందని దేవీ భాగవతంలో చెప్పబడింది. పూర్వకాలంలో మంత్రోపాసకులు గాయత్రీ దేవిని ఉపాసన చేసినట్లు శాస్త్రాలు ఉన్నాయి. గాయత్రి మాత దర్శనం అత్యంత విశేషం.



# రమణేశ్వరంలో వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు!



రమణేశ్వరం: ఆధ్యాత్మిక దివ్యక్షేత్రమైన రమణేశ్వరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, పవిత్ర వాతావరణంలో ప్రారంభమయ్యాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో అమ్మవారి విశేష పూజలు, వేద మంత్రోచ్చారణల నడుమ కన్నులపండువగా మొదలయ్యాయి. ఉత్సవాల మొదటి రోజు నుంచే క్షేత్రమంతా భక్తుల రాకతో సందడిగా మారింది. భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సును, లౌకిక సంపదను కాక్షించే పరమపూజ్య సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు భక్తుల కోసం ఈ పవిత్ర నవరాత్రి రోజుల్లో అద్భుతమైన పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు స్వయంగా తమ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందేలా ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశారు.



ముఖ్యంగా అమ్మవారి దివ్య కృపను కోరే భక్తుల కోసం రమణేశ్వరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించే సువర్ణావకాశాన్ని సిద్ధగురువులు కల్పించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లు తొలగిపోయి, మనశ్శాంతి, ఆయురారోగ్యాలు సిద్ధింపజేసుకోవడానికి ఈ కుంకుమార్చనలు ఎంతగానో తోడ్పడతాయని వేద పండితులు వెల్లడించారు.ఈ నవరాత్రి వేడుకల్లో భాగంగా దేవీ శరన్నవరాత్రుల విశిష్టతను చాటుతూ ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, అర్చనలు కొనసాగుతున్నాయి. అమ్మవారికి సమర్పించే కీర్తనలు, అద్భుత గీతాలతో రమణేశ్వర ధామం పులకించిపోతోంది. దేశం నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తులతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి దివ్య సంకల్పంతో ఏర్పాటైన ఈ దసరా పూజా మహోత్సవాలలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహక వర్గం అన్ని వసతులను సమకూర్చింది. భక్తులు సులభంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా, కుంకుమార్చనలలో పాలుపంచుకునేలా ప్రత్యేక క్యూలైన్లు, సౌకర్యాలు కల్పించారు.

దసరా శరన్నవరాత్రుల ఈ పవిత్ర దినాలలో రమణేశ్వరానికి విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు జరిపించుకోవడం ద్వారా సకల పాపాలు హరించుపోతాయని, అమ్మవారి కరుణాకటాక్షాలు పరిపూర్ణంగా లభిస్తాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.ఈ వైభవపేతమైన శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి దివ్య ఆశీస్సులతో అమ్మవారి కృపకు పాత్రులు కావాలని రమణేశ్వరం ఉత్సవ కమిటీ సవినయంగా ఆహ్వానిస్తోంది.

# 13 న విజయవాడలో 'జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026'



**మంత్రి కొండపల్లి శ్రీనివాస్.**

అమరావతి BNS అక్టోబర్ 11 : దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల (SHG) సభ్యులు, గ్రామీణ కళాకారులు, పారిశ్రామికవేత్తల అద్భుతమైన ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గొప్ప మార్కెటింగ్ వేదికగా ' జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026 విజయవాడ పున్నమి ఘాట్లో ' ఏర్పాటు చేయనున్నట్లు, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేళాలో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 576 స్టాళ్లు ఏర్పాటు చేశామని.. రాష్ట్రం నుంచి అత్యధికంగా 208 స్టాళ్లు ఉండగా, రాజస్థాన్ (24), మధ్యప్రదేశ్ (23), ఉత్తరప్రదేశ్ (22), మహారాష్ట్ర (21), పశ్చిమ బెంగాల్ (19), కేరళ (17), పంజాబ్ (17) రకరకాల స్టాల్స్ ఈ మేళాలో కొలువు దీరుతున్నాయని కొండపల్లి స్పష్టం చేశారు.

అమ్మవారి దర్శనానికి వచ్చేవారు ఈ మేళాను సందర్శించి దేశవ్యాప్త రుచులు, వస్తువులను ఆస్వాదించవచ్చని పిలుపునిచ్చారు. ఈ మేళాలో చేనేత ఉత్పత్తులు ఉప్పాడ, వెంకటగిరి, పట్టు చీరలు, కలంకారి వస్త్రాలు, ఖాదీ దుస్తులు మరియు గృహ అలంకరణ వస్తువులతో పాటు చేతిపనుల వస్తువులైన చెక్క శిల్పాలు, టెర్రకోట పాత్రలు, జూట్ బ్యాగులు, ప్రకృతి సిద్ధమైన సబ్బులు, హెర్బల్ ఉత్పత్తులు కూడా ప్రదర్శనలో ఉంచుతారని తెలిపారు.

చిరుధాన్యాలు (మిల్లెట్స్), సంప్రదాయ స్వీట్లు, కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, నాణ్యమైన ఊరగాయలు, తేనె మరియు అటవీ సహజ ఉత్పత్తులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రసిద్ధ లైవ్ ఫుడ్ స్టాళ్లు కూడా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మేళాకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విశాలమైన పార్కింగ్, తాగునీరు, భద్రత మరియు వైద్య శిబిరాలు వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నామని... విజయవాడ చుట్టుపక్కల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామీణ మహిళా శక్తిని ప్రోత్సహించాలని మంత్రి కొండపల్లి విజ్ఞప్తి చేశారు.

# ఏ పార్టీ బతకాలి అనేది కాదు వ్యవస్థ బతకాలి అన్నది ముఖ్యం.

**చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో అందుకనే ధైర్యంగా ముందుకు వచ్చాము.**
**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.**

అమరావతి BNS అక్టోబర్ 11 : ఏ పార్టీలో బ్రతకాలి అన్నది ముఖ్యం కాదని వ్యవస్థను బ్రతికించాలి అన్నది ముఖ్యమని మా దిశగా ప్రతి ఒక్కరూ వారి వారి గమనాల్ని మార్చుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.రంపచోడవరం నియోజకవర్గం కాకవాడ గ్రామసభలో మాట్లాడుతూ,గిరిజన బిడ్డలలో స్వచ్ఛత ఎక్కువగా ఉంటుందని దాన్ని గమనించే గిరిజన ప్రాంతాల అభివృద్ధి చేసేందుకు తాను కృత నిశ్చయంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధిని గత గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం క్షమించరాని నేరమని,రాజకీయాలకు అతీతంగా గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా నిధుల కేటాయించినట్లు తెలిపారు.

అడవితల్లి బాట 2.0 ద్వారా రూ.2,052 కోట్లతో 2,569 పనులకు శ్రీకారం చెప్పినట్లు అన్నారు.

గతంలో విజయం కోసం మన పార్టీ నాయకులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి త్యాగాలను గుర్తిస్తూ పొత్తు ధర్మానికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మన నాయకుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం, కూటమి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కూటమిలోని ప్రతి నాయకుడు అండగా నిలవాలని కోరారు. జనసేన కార్యకర్తలు

ఏ ఒక్కరూ పదవులూ ఆశించకుండా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి నిస్వార్థంగా పార్టీ కోసం, కూటమి కోసం తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు.నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా మన వాళ్ళు, వీరమహిళలు తమ సంఘీభావాన్ని చాటారు. కష్టకాలంలో అండగా నిలిచిన వారి త్యాగాలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ మన పార్టీ నాయకులకు, వీరమహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. వారి త్యాగాలకు తగిన గౌరవం లభించాలి. పదవులు



ఆశించకుండా అండగా నిలిచిన వారి నమ్మకాన్ని మనం నిలబెట్టాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, మార్కెట్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పీఎం-జన్మన్, పీఎంజీఎస్‌వై-4, ఉపాధి హామీ పథకాల సమన్వయంతో 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించాం. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం కింద 858 గిరిజన ఆవాసాలకు 1,662 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.1,406 కోట్లతో పనులు చేపట్టాం. ఇదే స్ఫూర్తితో అడవితల్లి బాట 2.0 ద్వారా మరో 1,341 ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణం కోసం రూ.2,052 కోట్లతో మొత్తం 2,569 పనులను మంజూరు చేసినట్లు తెలిపారు.

# జనసేన స్థానిక ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీలో చింతలపల్లి రవీంద్రనాథ్‌కు చోటు

- వెంకటగిరి నియోజకవర్గ కమిటీలో సైదాపురం మండలం నుంచి నియామకం



నెల్లూరు జిల్లా సైదాపురం(బిఎన్ఎస్):- జనసేన పార్టీ స్థానిక ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీలో సైదాపురం మండలానికి చెందిన చింతలపల్లి రవీంద్రనాథ్‌కు చోటు లభించింది. వెంకటగిరి నియోజకవర్గ స్థానిక ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీలో ఆయనను నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నాయి.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలో నిలపడంతో పాటు, వారి విజయానికి సమన్వయంతో కృషి చేయాలనే లక్ష్యంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహాల రూపకల్పన, అభ్యర్థులకు సంబంధించిన అంశాల్లో కమిటీ కీలకంగా వ్యవహరించనుంది.ఈ నేపథ్యంలో చింతలపల్లి రవీంద్రనాథ్‌కు కమిటీలో స్థానం కల్పించడంతో సైదాపురం మండలంలో జనసేన పార్టీ ఎన్నికల కార్యకలాపాల్లో ఆయన భాగస్వామ్యం కానున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల సమన్వయంలో ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

# మరో మైసూరుగా ఖ్యాతి గడించిన "ప్రొద్దుటూరు దసరా" మహా సంబరాలు..!!

## చరిత్రలో తరగని.. చెరగని ప్రొద్దుటూరు దసరా ఉత్సవాల వైభవం..

*"దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యో.. ప్రొద్దుటూరు పురవీధుల్లో పండుగ సందడి మొదలైందయ్యో.. అడుగడుగునా ఆనందం. వీధి,వీధినా వైభవం.. ఊరంతా ఉత్సాహం.. కన్నుల నిండా కోలాహలం.. ఇదేదో మామూలు పండుగ కాదు. తరతరాల చరిత్రకు అద్దం పట్టే మహా సంబరం. ఆచారాల అందం. సంప్రదాయాల సందడి. ప్రజల ఐక్యతకు ప్రతిరూపం. రాయలసీమ గుండెల్లో గర్వంగా నిలిచిన ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది."*



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 11: మైసూరు దసరా అంటే రాజసం గుర్తుకొస్తుంది. ప్రొద్దుటూరు దసరా అంటే ప్రజల పండుగ కళ్లముందు కదలాడుతుంది. అక్కడ రాజవంశాల వైభవం కనిపిస్తే.. ఇక్కడ జన జీవన వైభవం పలకరిస్తుంది. అక్కడ రాజ దర్బారు సంప్రదాయాలు మెరిస్తే.. ఇక్కడ ప్రజల మనసులే పండుగ పందిళ్లవుతాయి. అందుకే ప్రొద్దుటూరు దసరా ఓ వేడుక మాత్రమే కాదు. ఓ చరిత్ర, ఓ సంస్కృతి, ఓ సామూహిక సంతోషం, కాలం మారినా.. తరాలు మారినా.. ఈ పండుగపై ప్రజల ప్రేమ మాత్రం తరగదు. ఈ వైభవం ఎప్పటికీ చెరగదు.

ప్రొద్దుటూరుకు చరిత్ర ఉంది. ఘనమైన వ్యాపార వారసత్వం ఉంది. బంగారు నగల వ్యాపారంతో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. కష్టానికి కిరీటం పెట్టిన పట్టణమిది. వ్యాపారానికి కొత్త అర్థం చెప్పిన నేల ఇది. అలాంటి ఊరిలో పండుగలకూ ఓ ప్రత్యేక శోభ ఉంటుంది. దసరా వచ్చిందంటే చాలు.. పట్టణం కొత్త కళను సంతరించుకుంటుంది. ఇళ్లలో పూజలు, వీధుల్లో, సందళ్లు, ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు. బంధుమిత్రుల రాకపోకలు. పిల్లల కేరింతలు, పెద్దల ముచ్చట్లు, ఎక్కడ చూసినా ఆప్యాయతల హరివిల్లు. పాత జ్ఞాపకాలు కొత్త తరాలకు పరిచయమవుతాయి. నిన్నటి కథలు నేటి కబుర్లవుతాయి. ఒకప్పుడు పెద్దలు చూసిన ఉత్సవాలను ఇప్పుడు పిల్లలు చూస్తారు. వారు చూసిన ఆనందాన్ని తమ పిల్లలకు అందిస్తారు. ఇలా దసరా ఓ తరం నుంచి మరో తరానికి అందే అపురూప కానుకగా మారుతుంది. పండుగలో కనిపించేది అలంకరణ మాత్రమే కాదు. మనుషులను కలిపే అనుబంధం. మనసులను ముడివేసే మమకారం. ఊరిని ఒక్కటిగా నిలిపే ఆత్మీయత. ఇదే ప్రొద్దుటూరు పండుగల అసలైన సంపద.

దసరా అంటే చెడుపై మంచి సాధించిన విజయం. అహంకారంపై ధర్మం సాధించిన గెలుపు. చీకటిపై వెలుగు చేసిన దండయాత్ర. ఈ సందేశమే పండుగకు ప్రాణం. ప్రొద్దుటూరు లోనూ ఆ పండుగ భావనకు ప్రజల ఆచారాలు తోడవుతాయి. అమ్మవారి ఆరాధనలో భక్తి పరిమళిస్తుంది, పూజలలో సంప్రదాయం పలుకరిస్తుంది, ఉత్సవాల్లో ఉత్సాహం ఉప్పొంగుతుంది, పండుగను చూడటానికి వచ్చినవారికి రంగుల లోకం కనిపిస్తుంది. పాల్గొన్నవారికి ఆత్మీయతల లోకం అనుభవమవుతుంది. ఒకరి ఆనందంలో మరొకరు పాలుపంచుకుంటారు. ఒకరి సంతోషాన్ని మరొకరు తమదిగా భావిస్తారు. అదే మన పండుగల గొప్పదనం. నేటి వేగవంతమైన జీవితంలో మనుషుల మధ్య దూరాలు పెరుగుతున్నాయి. పలకరింపులు తగ్గుతున్నాయి. కలిసిమెలిసి గడిపే సమయం కరిగిపోతోంది. అలాంటి వేళ దసరా ఓ మధురమైన విరామం. కుటుంబాలను కలిపే వేదిక. స్నేహాలను బలపరిచే సందర్భం, సమాజాన్ని ఒక్క తాటిపైకి తెచ్చే పండుగ. ప్రొద్దుటూరు దసరా వైభవంలో ఈ సామాజిక సౌందర్యం కూడా అంతర్లీనంగా కనిపిస్తుంది.

మైసూరు దసరాకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. రాజసం ఉట్టిపడే వేడుకలు ఉన్నాయి. శతాబ్దాల చరిత్రను చాటే సంప్రదాయాలు ఉన్నాయి. ప్రొద్దుటూరు దసరాకూ తనదైన ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజల భాగస్వామ్యం, స్థానిక సంప్రదాయాల పరిమళం, తరతరాల అనుబంధాల పరవశం, ఇవే ఈ వేడుకకు అసలైన అలంకారాలు.. మైసూరుతో పోలిక అంటే కేవలం వైభవాన్ని గుర్తు చేసుకోవడమే కాదు. మన ప్రాంతపు ప్రత్యేకతను ప్రపంచానికి చాటాలనే ఆకాంక్ష కూడా అయితే ప్రతి పండుగకు దాని సొంత చరిత్ర ఉంటుంది. దాని సొంత సొగసు ఉంటుంది. దాని సొంత ఆత్మ ఉంటుంది. ప్రొద్దుటూరు దసరా ఆత్మ ప్రజల్లో ఉంది. వారి భక్తిలో ఉంది. వారి ఉత్సాహంలో ఉంది. వారి సామూహిక ఆనందంలో ఉంది. ఈ వైభవాన్ని మరింత విస్తరించాలి. చరిత్రను సేకరించాలి. పాత చిత్రాలను భద్రపరచాలి. పెద్దల అనుభవాలను లిఖించాలి, కొత్త తరాలకు ఈ పండుగ విశిష్టతను తెలియజేయాలి, స్థానిక కళలకు ప్రోత్సాహం అందించాలి, సంప్రదాయాలకు కొత్త ఊపిరి పోయాలి, అప్పుడే నేటి సంబరం రేపటి చరిత్రగా నిలుస్తుంది. అప్పుడే ప్రొద్దుటూరు దసరా ఖ్యాతి మరింత దూరం ప్రయాణిస్తుంది.

దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యో! ఈ మాటల్లోనే పండుగ ప్రాణం ఉంది. ఈ పలుకుల్లోనే ప్రొద్దుటూరు ప్రజల ఆనందం ఉంది. పండుగ ముగుస్తుంది. అలంకరణలు తొలగిపోతాయి. వీధులు మళ్లీ మామూలు రూపాన్ని సంతరించుకుంటాయి. కానీ మనసుల్లో మిగిలే జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోవు. చిన్ననాటి దసరా ముచ్చట్లు. పెద్దలతో కలిసి చూసిన వేడుకలు. స్నేహితులతో పంచుకున్న సంతోషాలు. కుటుంబంతో గడిపిన మధుర క్షణాలు. ఇవన్నీ కాలగమనంలో తీపి గుర్తులుగా మిగిలిపోతాయి. అందుకే ప్రొద్దుటూరు దసరా ఒక రోజుతో ముగిసే పండుగ కాదు. ఏడాది పొడవునా ఎదురు చూపులు పెంచే ఆనందం. తర తరాలుగా కొనసాగుతున్న సంస్కృతికి సజీవ సాక్ష్యం. చరిత్ర పుటల్లో నిలిచే వైభవం. ప్రజల హృదయాల్లో వెలిగే దీపం. నిన్నటి సంప్రదాయాన్ని నేటి తరానికి అందించే వారధి. రేపటి తరాలకు గర్వకారణం. ప్రొద్దుటూరు దసరా మరింత ఘనంగా జరగాలి. దాని చరిత్ర మరింత విస్తృతంగా వెలుగులోకి రావాలి. దాని ప్రత్యేకత దేశమంతా తెలియాలి. మైసూరు దసరా తన రాజసంతో మెరిస్తే.. ప్రొద్దుటూరు దసరా ప్రజల ప్రేమతో వెలగాలి. అదే ఈ పట్టణానికి నిజమైన గౌరవం. అదే ఈ పండుగకు అసలైన వైభవం. అదే మన నేల గొప్పదనం.

# గౌరారంలో అంగరంగ వైభవంగా నవరాత్రి వేడుకలు



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలో తొలిసారిగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశ్వపాలిని అమ్మవారి వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని హనుమాన్ ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, నృత్యాల నడుమ పురవీధుల గుండాఅట్టహాసంగా ప్రారంభమైన నవరాత్రి వేడుకలు ఆలయ ప్రాంగణంలో చండీ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని మంగళవాయిద్యాలు, డప్పు చప్పులతో నృత్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వేద మంత్రోచ్చరణల మధ్య మాలాధారణ, మండప స్థాపన, ఘటస్థాపన, అమ్మవార్ల ప్రతిష్ఠాపన శ్యాం పండితులు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, దీక్షాపరులు పాల్గొన్నారు. వైభవంగా ఊరేగించి ప్రత్యేక మండపంలో కొలువుదీర్చారు. చిన్నారుల నృత్యాలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# వెంకట సాయి నగర్ కాలనీలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



బిఎన్ఎస్ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు హైదరాబాద్‌లోని రామంతాపూర్ వెంకట సాయి నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కాలనీవాసుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమం కోసం కృషి చేస్తూనే, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ పాలన ప్రస్థానం!



నాయకుడు అంటే కేవలం అధికార పీఠం పై కూర్చునేవాడు కాదు, కోట్లాది మంది ప్రజల కన్నీళ్ళును తుడిచి, వారి జీవితాల్లో ఆనందాన్ని నింపేవాడు. భారతదేశ రాజకీయ యవనికపై నరేంద్ర మోదీ అనే పేరు ఒక సంచలనం. గుజరాత్ ముఖ్యమంత్రి గా సుదీరఘ కాలం, ఆ తర్వాత దేశ ప్రధానమంత్రి గా భారతదేశాని ప్రరంచ యవనికపై అగ్రగామిగా నిలిపిన ప్రజా నాయకుడు మన నరేంద్ర మోదీ గారు. ఆయన పరిపాలన ప్రస్థానం విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకంది. ఒక సాధారణ సామాన్యుడిగా, టీ అమ్మిన వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి , ఈ దేశాని శాసంచే స్థాయికి ఎదిగిన మోదీ గారి ప్రస్తావంలో ఎన్నో సవాళ్లు, మరెన్నో మైలురాళ్లు ఉన్నాయి. ఆయన పాలనలో కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే జరగలేదు; సమాజంలో అట్టడుగు ఉన్న ప్రతీ ఒక్కరికి అందాలనే అందాలనే సంకల్పం నెరవేరింది. మధ్యవర్తుల వ్యవస్థను రూపుమాపి, లంచగండితనానికి తావులేకుండా ప్రతి సంక్షేమ పథకం సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు

ఖాతాల్లాకే వేసే 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్సుర్' (డీబీటీ) విధానాన్ని తెచ్చి దేశ పాలనా చరిత్రను ఆయన మార్చారు. ఈ 25 ఏళ్ల పరిపాలన ఉత్సవాలు శుభ సమయంలో , సామాన్య ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అద్భుతమైన సంక్షేమ,

అభివృద్ధి పథకాలు, వాటి ద్వారా సామాన్యులకు జరుగుతున్న మేలు గురించి ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునేలా సాగుతున్న ప్రగతి ప్రస్థానం ఇది. దేశానికి వెన్నుముక రైతు అని నమ్మి, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పండుగలా మార్చడానికి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. రైతులకు పంట పెట్టుబడి కోసం ఇతరులపై ఆధారపడకుండా, వడ్డీ వ్యాపారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు తెచ్చిన అద్భుతమైన పథకం పీ.ఎం కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్) దీని ద్వారా సాగు ఖర్చులకోసం రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందిస్తూ, అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6,000 ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఈ మొత్తాన్ని ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2,000 చొప్పున మూడు విడతల్లో నేరుగా రైతు ఖాతాలోనే జమ చేస్తున్నారు. భూమి కలిగి ఉన్న చిన్న, చిన్న-కారు కమతాల రైతులకు ఇది ఎంతో ఆసరాగా నిలుస్తుంది. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, పురుగుల తాకిడి వల్ల పంటలు నష్టపోతే రైతు రోడ్డున పడకుండా ఇన్సూరెన్స్ ద్వారా రక్షణ కల్పించేందుకు పీఎం పాసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) , అమలు చేస్తున్నారు. ఖరీఫ్ పంటకు 2% రబీ పంటకు 1.5% వాణిజ్య పంటకు 5% అత్యంత తక్కువ ప్రీమియం రైతు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన భారీ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ పంట నష్టానికి పూర్తి పరిహారం అందజేస్తుంది. వృద్ధాప్యంలో సన్న కారు, చిన్న కారు రైతులకు సామాజిక భద్రత కల్పించేందుకు పీ.ఎం కిసాన్ మన్ ధన్ యోజన(పీఎం-కేఎంవై) ద్వారా 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెల రూ.3,000 పింఛన్ అందిస్తూ అన్నదాతలను ఆదుకుంటున్నారు. పేదవాడికి పెద్ద జబ్బు వస్తే ఇల్లు, ఒళ్ళు అమ్ముకోవాల్సిన పరిస్థితి గతంలో ఉండేదని, ఆ పరిస్థితిని పూర్తిగా మారుస్తూ సామాన్యుడికి కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు ప్రధాన మోడీ.

ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జనోరోగ్య యోజన (పీఎం-జేఏవై) ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందుతుంది. నెట్వర్క్ ఆసుపత్రుల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత ద్వితీయ, తృతీయ స్థాయి చికిత్సకు, పెద్దపెద్ద శాస్త్ర చికిత్సలు లభిస్తాయి. ఇందులో ప్రత్యేకత ఏంటంటే 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఆదాయంతో సంబంధం లేకుండా ప్రత్యేక ఉచిత వైద్య 'వయో వందన కార్డులు'అందిస్తున్నారు. దీనితో పాటు మార్కెట్లో అత్యంత ఖరీదైన మందులను సామాన్యులకు అతి తక్కువ ధరలకే అందించేందుకు ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పీఎంబీజేపీ) ద్వారా జనరిక్ మందులను 50% నుండి 90% వరకు తక్కువ ధరలకే అందిస్తూ సామాన్యుల నెలవారి ఖర్చులను భారీగా తగ్గిస్తున్నారు.

సొంతిల్లు అనేది ప్రతి మనిషి జీవితా కల కాగా, ఆ కలను సాకారం చేసేందుకు మోదీ ప్రభుత్వం ఇలా నిర్మాణానికి పెద్ద పీటం వేసింది.పీ.ఎం ఆవాస్ యోజన (పీఎంఏవై) ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఇల్లు లేని పేదలకు రూ.1.20 లక్షల నుండి రూ.1.30 లక్షల వరకు నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్నారు పట్టణాల్లోని పేద ,మధ్యతరగతి ప్రజలు ఇల్లు కట్టుకోవాలన్న లేదా కొత్త ఇల్లు కొనుగోలు చేయాలన్న హోమ్ లోన్ వడ్డీ పై రూ.2.67 లక్షల వరకు సబ్సిడీ పొందే గొప్ప అవకాశం కల్పించారు. అలాగే పొగ బారిన వంటిళ్ల నుంచి మహిళలకు విముక్తి కలిగించి, శుభ్రమైన ఇంధనాన్ని అందించేందుకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) కింద పేద కుటుంబాల మహిళలకు ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్, మొదటి సిలిండర్ మరియు స్టవ్ ఉచితంగా ఇస్తూ సబ్సిడీని నేరుగా ఖాతాలో వేస్తున్నారు. మన సంస్కృతికి మూల స్తంభాలైన చేతి వృత్తుల వారి కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టి 18 రకాల సాంప్రదాయ వృత్తుల వారికి రూ.15,000 టూల్కిట్ గ్రాంట్, ఉచిత ఆధునిక శిక్షణ మరియు అతి తక్కువ వడ్డీకే (5%) రూ.3 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు ఇస్తూ ఆర్థిక చేయూతనిస్తున్నారు.బ్యాంకు మెట్లు ఎక్కాలంటే భయపడే సామాన్యుడి గౌరవంగా బ్యాంకు లోపలికి తీసుకెళ్లిన ఘనత మోదీ ప్రభుత్వానిది.

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) ద్వారా రూపాయి డిపాజిట్ లేకుండా (జీరో బ్యాలెన్స్) ప్రతి పేదవాడు బ్యాంకు ఖాతాలు తెరిచే వెసులుబాటు కల్పించడమే కాకుండా ఉచిత 'రూపే' డెబిట్ కార్డ్, రూ.2 లక్షల ఉచిత ప్రధాన ఇన్సూరెన్స్, ఖాతా సంక్రమంగా నిర్వహించే వారికి రూ.10,000 పోవ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించారు. చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) ద్వారా శిశు, కిశోర్, తరుణ్ విభాగాల కింద రూ.50,000 నుండి రూ.10 లక్షల వరకు ఇలాంటి ఆస్తులు తాకట్టు పెట్టాల్సిన అవసరం లేకుండా రుణాలు అందిస్తున్నారు. కరోనా కష్టకాలం తర్వాత వీధి వ్యాపారుల ఆర్థిక పునరుద్ధరణ కోసం రూపొందించిన పీఎం సన్నిధి (పీఎం స్వనిధి) పథకం ద్వారా మొదటగా రూ.10,000 పూచి కత్తులేని రుణం ఇస్తూ, దాన్ని సరైన సమయానికి చెల్లిస్తే రూ.20,000, ఆపై రూ.50,000 వరకు రుణం ఇస్తూ డిజిటల్ లావాదేవులపై క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా అందిస్తున్నారు. ప్రమాదాలు లేదా అనుకోని మరణాలు సంభవించినప్పుడు ఆ పేద కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు, కేవలం గుప్పెడు పైసల ప్రీమియంతో భారీ ఇన్సూరెన్స్ పథకాలను మోదీ ప్రభుత్వం తెచ్చింది.

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ద్వారా ఏడాదికి కేవలం రూ.20 ప్రీమియానికే ప్రమాదవశాత్తు మరణించిన లేదా పూర్తి వైకల్యం వచ్చిన రూ.2 లక్షలు అందిస్తున్నారు. అలాగే ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) ద్వారా ఏడాదికి కేవలం రూ.436 చెల్లిస్తే, ఇన్సూరెన్స్ పొందిన వ్యక్తి ఏ కారణం చేతైనా మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు అందుతాయి. అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు వృద్ధాప్యంలో గౌరవప్రదంగా జీవించడానికి ఉద్దేశించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) ద్వారా 60 ఏళ్ళు నిండిన తర్వాత ప్రతినెల రూ.1,000 నుండి రూ.5,000 వరకు గ్యారెంటీ పెన్షన్ వచ్చేలా చిన్న వయస్సు నుండే పొదుపు చేసుకునే మార్గం సుగమం చేశారు.

మహిళా సాధికారతకు మోడీ గారి పాలనలో పెద్దపీఠం వేశారు. లఖపతి దీదీ యోజన ద్వారా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు ఏడాదికి కనీసం రూ.1 లక్ష నికర రాబడి పొందేల ప్లంబింగ్, డ్రోన్ ఆపరేషన్ (డ్రోన్ దీదీ). కుట్టు మిషన్లు, ఎల్ఈడి బల్బుల తయారీ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చి వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు.

ఆడపిల్లల భవిష్యత్తు, చదువు, వివాహ ఖర్చులకోసం రూపొందించిన దేశంలోనే అత్యుత్తమ పొదుపు పథకం సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) ద్వారా 10 ఏళ్ల లోపు ఉన్న అమ్మాయి పేరు మీద పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంకులో ఖాతా తెరిచి గరిష్టంగా 8.2% వరకు అత్యధిక చక్రవడ్డీతో పొదుపు చేసుకునే అవకాశం కల్పించారు. మహిళలు తమ చిన్న పొదుపు మొత్తాలపై గరిష్ట లాభం పొందేందుకు మహిళ సన్మానం పొదుపు పత్రం (ఎంఎస్ఎస్‌సీ) ద్వారా రెండు సంవత్సరాల కాల పరిమితికి 7.5% చక్రవడ్డీ ఇస్తున్నారు. గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహార లోపం నివారించేందుకు పీఎం మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) ద్వారా మొదటి సంవత్సరానికి రూ.5,000, రెండో సంవత్సరంలో ఆడపిల్లల జన్మిస్తే ఒకే విడతలో రూ.6,000 అందిస్తున్నారు. మిషన్ శక్తి కింద వన్ స్టాప్ సెంటర్, మహిళ హెల్ప్ లైన్ (181), శక్తి సదన్, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ మరియు పాల కేంద్రాల ద్వారా మహిళల రక్షణ మరియు సాధికారతను ప్రతిష్ట చేశారు. భారతదేశ బలం యువత అని నమ్మి, వారి నైపుణ్యాభివృద్ధికి సరికొత్త పథకాలను మోదీ ప్రభుత్వం తెచ్చింది. పి.ఎం ఇంటెన్షిప్ స్కీం ద్వారా దేశంలోని అగ్రశ్రేణి 500 కంపెనీల్లో 12 నెలల పాటు ఇంటర్ షిప్ చేసే అవకాశం కల్పిస్తూ ప్రతి నెల రూ.5,000 స్టైపెండ్ వన్ టైం సాయంగా రూ.6,000 అందిస్తున్నారు.ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలియన్స్, రోబోటిక్ సెండ్ ఆధునిక కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ తో పాటు ఉద్యోగ అవకాశాల కల్పన చేస్తున్నారు. స్టార్ట్ అప్ ఇండియా ద్వారా ప్రతి బ్యాంకు శాఖ కనీసం ఒక ఎస్సీ/ఎస్టీ మరి ఒక మహిళ పారిశ్రామిక వత్తకు రూ.10 లక్షల నుండి రూ. 1 కోటి వరకు కొత్త వ్యాపారుల కోసం ఋణం మంజూరు చేయడం తప్పనిసరి చేశారు.

దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదని మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ఆహార భద్రత పథకాలను పతిష్టంగా అమలు చేస్తుంది.పి యం గరీబ్ కళ్యాణ్ అన్ యోజన (పీఎంజీకేఏవై) ద్వారా దేశంలోని 80 కోట్లకు పైగా పేద ప్రజలకు రేషన్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి నెలకు 5 కిలోల బియ్యం లేదా గోధుమలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేద కుటుంబానికి కనీసం 100 రోజుల వేతన ఉపాధికి గ్యారెంటీ ఇస్తూ రోజువారి వేతనం నేరుగా వారి బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నారు.



వయోవృద్ధుల సంక్షేమ కోసం రాష్ట్రీయ వయోశ్రీ యోజన ద్వారా ఉచితంగా వీల్ చైర్లు, నడక కర్రలు, వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్) ద్వారా వయోవృద్ధి పొదుపు సొమ్ముపై అత్యాతికంగా 8.2% వడ్డీ ఇస్తూ, ఎల్డరైన్ (14567) ద్వారా వృద్ధులకు ఆపదలో తక్షణ సహాయం అందిస్తున్నారు.

ఈ పథకాలన్నీటిని దరఖాస్తు చేసుకోవటం, పొందటం మోదీ గారు చాలా సులభం చేశారు ప్రతి పథకానికి ఆధార్ కార్డు, దానికి అనుసంధానించబడిన బ్యాంకు ఖాతా (డీబీటీ యాక్టివ్) తప్పనిసరి చేయడం ద్వారా మధ్య వర్తుల దోపిడీకి అడ్డుకట్టు పడింది. సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) లేదా ' మీ సేవ' కేంద్రాల ద్వారా ఆన్లైన్లో చాలా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. జన్ సమత్ హోటల్ ద్వారా ప్రభుత్వ రుణ ఆధారిత పథకాలన్నీటికీ ఒకే వేదిక ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. మొబైల్ లో ఉమా యాప్ ద్వారా కూడా అనేక పథకాల పురోగతి అర్హతులు తెలుసుకోవచ్చు. గర్భిణీ స్త్రీల సంక్షేమ పథకాల కోసం స్థానిక అంగన్వాడి కేంద్రాలు లేదా ఆశ కార్యకర్తలను సంప్రదిస్తే వారి ఉచితంగా అప్లికేషన్ పూర్తి చేస్తారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి 25 ఏళ్ల పరిపాలన కాలం భారతదేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. గుజరాత్ ముఖ్యమంత్రిగా సంస్కరణల బాటలు వేసి నేడు దేశ ప్రధానిగా భారతదేశాన్ని ప్రపంచంలోనే ఐదోవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టడం సామాన్యమైన విషయం కాదు. ఆయన ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్ కప్ ప్రయాజ్" అనే స్పష్టమైన సందేశం కనిపిస్తుంది. కులమతాలకు అతీతంగా పేదరిక నిర్మూలనే దేంగా సాగుతున్న ఈ ప్రగతియాత్ర దేశంలోని ప్రతి సామాన్యుడు ఇంట వెలుగులు నింపుతుంది రైతు చేతికి పెట్టుబడి సాయం ,పేదవాడికి ఉచిత కార్పొరేట్ వైద్యం , మహిళలకు ఆర్థిక సాధికారత, యువతకు నైపుణ్య శిక్షణ, వృద్ధులకు సామాజిక భద్రత కల్పిస్తూ మోడీ ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఈ పాతికేళ్ల పండుగ వేళ భారతదేశ అన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని ప్రధానమంత్రి మోడీ గారి సంకల్పానికి మనమందరం తోడుగా నిలుస్తూ నవభారత నిర్మాణంలో భాగస్వాములమవుదాం!

(( డా.రామకృష్ణ
సహాయ ఆచార్యులు ,ఉస్మానియా యూనివర్సిటీ.))